ఊపిరి తిరగడం లేదు కిరీటికి.

చెప్పకుండా పెళ్ళి చేసుకున్నందుకు నొచ్చుకోవటాలూ, శుభాకాంక్షలూ.... అభినందనలూ....

ఫోన్ల ఉధృతానికి తట్టుకోలేక 'ఎమ్ డీ ఈజ్ నాట్ ఎవయిలబుల్ ఇన్‌సీట్' అని చెప్పమని ఎక్స్‌చేంజ్ ఆపరేటర్‌కు ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వమని భూషణ్‌కు చెప్పేటంతలో మరో ఫోన్....

'హల్లో... కిరీటి హియర్.'

'యు నాటీ... నువ్వింతమోసగాడివనుకోలేదు' అలా తనతో ఫోన్‌లో ఛటీకి దిగేది జయశ్రీ మాత్రమే అని అతనికి తెలుసు. అరణి ఎక్స్‌పోర్ట్ ఏజన్సీస్ యజమాని అయిన గజేంద్రకుమార్ భార్య ఆమె.

'ఏం....పెళ్ళికాగానే మగాడివై పోయావా'

'ఉహు, మూగవాడినయ్యాననే పెళ్ళి చేసుకున్నాను.'

'అబద్ధం.'

'ఏమిటీ... మూగవాడ్ని అవటమా, పెళ్ళీ చేసుకోవటామా?'

'నువ్వు మూగవాడివి అవటం అయినా మాట మాత్రం మాతో చెప్పకుండా ఇంత పనిచేశావే... మేమేమన్నా నీ వెంట పడతాం అని భయం వేసిందా?'

'అదికాదు అనుకోకుండా జరిగి పోయింది.'

'ఏమిటి పెళ్ళా! మాకు చెప్పకపోవటమా?'

'రెండూనూ....'

'నిన్ను షూట్ చేయాలి.'

'వెల్ కం.'

'మీ ఆవిడ్ని చూపిస్తావా?'

'విత్ ప్లజర్....'

నీలా స్మార్ట్‌గా ఐమీన్ నీలా ప్రెట్టీగా వుంటుందా... బాగా చదువు కుందా... పేరేమిటి..?'

'ఇంత పెద్ద క్వశ్చనీర్‌కు ఫోన్‌లో సమాధానం చెప్పటం సాధ్యం కాదు.'

'మరేం చేయాలట...' గోముగా అడిగింది.

'బంధు మిత్ర సపరివార సమేతంగా వేంచేస్తామంటే ఓ బ్రహ్మాండమైన పార్టీ అరేంజ్ చేస్తాను.'

'బంధు మిత్ర సపరివారం అంటూ మావార్ని మర్చి పోయావు.'

'మీ శ్రీవారు సపరివారంలోకే వస్తారులే...'

'యూ నాటీ...'

'ఇక శెలవా...'

'ఏం... మీ ఆవిడతో మాట్లాడుకోవాలనుందా'

‘ఉహు! మీవారితో ఆట్లాడుకుంటావేమోనని.’

‘బోర్...’

‘సీయూ లేటర్.....’ ఫోన్ పెట్టేశాడు.

తుఫాన్ వెలసినట్టుగా వుంది.

భూషన్ని పిలిచి అఫీషియల్ ట్రంకాల్స్ తప్ప కనెక్ట్ చేయవద్దని ఇన్‌స్ట్రక్షనిచ్చాడు.

అయిష్టంగానే ఇంటికి ఫోన్‌చేశాడు.

శిల్పే ఫోన్ అందుకుంది.

‘నేను కిరీటిని మాట్లాడుతున్నా... బోర్‌గా వుందా?’

‘మీ స్నేహితులంతా అభినందనల్తో ఊదరగొట్టేస్తున్నారు.’

‘పర్సనల్‌గానా....’

‘కాదు...ఫోన్‌లోనే...’

‘పెద్ద సర్కిల్ కి చెందినవాళ్ళు.... ప్లీజ్.... కాస్త పేషన్స్ చూపించు.’

‘..........‘

‘సాయంత్రం షాపింగ్‌కి వెళదామా?’

‘అఖ్ఖర్లేదు......’

‘పిక్చర్.....’

‘ఉహూ....’

ఫోన్ డిస్‌కనెక్టు కావటంతో కొన్ని క్షణాలపాటు రిసీవర్ని పట్టుకుని అలాగే ఉండిపోయాడు.

ఏంచేయాలి... ఏంచేస్తే శిల్ప మారుతుంది.

ఆలోచనలతో అతని తల వేడెక్కి పోయింది.

సాయంకాలం పెందలాడే ఇంటికి చేరుకోవాలన్న పిచ్చికోరిక కలగడంతో అన్ని అపాయింట్‌మెంట్స్‌ని కేన్సిల్ చేసుకున్నాడు కిరీటి.

కారు దిగాక శిల్ప ఎదురొస్తే బాగుండునని, డ్రెస్ మార్చుకున్నాక శిల్ప తన చేతితో కాఫీ అందిస్తే మధురంగా వుండేదని ఆశపడ్డ కిరీటి కేవలం దురాశ మాత్రమే అనిపించడానికి ఎంతోసేపు పట్టలేదు.

అంత తొందరగా ఏనాడూ కిరీటి ఇంటికి రావటం చూడటం నౌకర్లంతా ముందు విస్తుపోయారు. పిదప కొత్త దాంపత్యం కదా అని సరిపెట్టుకున్నారు.

శిల్ప జాడ కనిపించక పోవటంతో ఆమెని చూడాలన్న ఉత్సుకత అధికమైంది.

నెమ్మదిగా టెర్రస్ పైకి వెళ్ళాడు.

నిశ్చలంగా సముద్రంకేసి చూస్తూ నిలబడి వుది శిల్ప.

చూడటంలోనే నీలమైంది.

అభ్యంగన స్నానం చేయటం మూలాన లయబద్ధకంగా గాలికి ఎగురుతున్న యామినీకుంతలాన్ని సుతి మెత్తగా స్పృశించాలని చేయి తిరిగిన చిత్రకారుడి కుంచెనుండి జాలు వారిన చందాన అద్భుత లావణ్యాన్ని సంతరించుకున్న ఆమె శరీరాన్ని సందిట బంధించాలన్న ఊహ అతడిలో విషశత్వాన్ని రేపింది.

'గుడీవినింగ్'

మాటలు కలిపే ఉద్దేశ్యంతో నెమ్మదిగా విష్ చేశాడు.

ఓమారు క్రీగంట చూసి మళ్ళీ తనను కాదన్నట్టుగాతల తిప్పుకుంది.

'నీ చేత్తో కాఫీ తాగాలనుంది.' వరం కోరుకుంటున్నట్టుగా అడిగాడు.

'చాలా మంది నౌకర్లున్నారుగా...'

'నేను కోరుకున్నది నీచేతి కాఫీని.....'

'ఓహో .... నేను ఖరీదైన నౌకర్నిగా, అందుకని నా చేతి కాఫీ రుచిగా ఉంటుందని చెప్పటం మీ అభిప్రాయం అనుకుంటున్నాను.' ఆమె నిష్టూరంతో నీరసబడి పోయాడు కిరీటి.

ఎంత దగ్గరవుదమన్నా కావాలని దూరమవుతున్న శిల్ప మొండి వైఖరి అతనిలో పెద్ద ప్రశ్నలా తయారైంది.

'హనీమూన్‌కి వెళదామా.....'

ఆమెతో ఏకాంతంగా గడపాలని ఆ విధంగా ఒకరినొకరు స్పష్టంగా అర్థం చేసుకునే అవకాశముంటుందన్న తలంపుతో అడిగాడు.

'అప్పటికైనా నేను మీకు లొంగిపోతానని నమ్మకమా?'

ఆమె జవాబు సూటిగా అతడి హృదయాన్ని తాకింది. మౌనంగా క్రిందికి నడిచి లైబ్రరీ రూంలో కూర్చున్నాడు.

వికలమైన మనస్సుతో చేతికందిన పుస్తకాన్నొకటి తీసుకొని పేజీలు తిరగేయసాగాడు.

ఏకాగ్రత చూపించలేక లాన్‌లోకి నడిచి కొంతసేపు పచార్లు చేస్తూ గడిపాడు.

ఇద్దరి మధ్య వైరుధ్యాన్ని నౌకర్లు ఎక్కడ గుర్తు పడతారో నన్న అనుమానం .....గిల్టీనెస్....

భోజనాల వేళ బుద్ధిగా డైనింగ్ టేబుల్ దగ్గర తన ప్రక్కనే కూర్చున్న శిల్పను చూడగానే అతని మనసు కాస్త స్థిరపడింది. కనీసం ఆ ఒక్క చోటనైనా ఎటికసీ మెయింటైన్ చేసినందుకు.

భోంచేశాక గంటపాటు లైబ్రరీలో గడపటం అతనికలవాటు.

పదిగంటల వేళ బెడ్‌రూంలో అడుగు పెట్టే సరికి శిల్ప తన కాట్ పైనే పడుకుని ఉండటం గమనించాడు.

నిద్రలేపడమా లేకపోతే తనే మరోకాట్‌పై పడుకోవటమా అని కొన్ని క్షణాలు ఆలోచించాడు.

ఆ మీమాంసలోనే కాస్త దగ్గరకు వెళ్ళాడు.

సబ్‌డ్యూడ్ లైటింగ్ చిమ్ముతున్న చిరుకాంతిలో ఆదమరిచి నిద్ర పోతున్న శిల్ప శరీర సౌష్ఠవం ఎల్లోరా శిల్ప సౌందర్యాన్ని గుర్తు చేస్తోంది.

చెదిరిన పైట.... ఫాలభాగంపై అస్తవ్యస్తంగా పడిన కురులు..... అదురుతున్న చిరు పెదవులు...

కొన్ని లిప్తలు పాటు అతని గుండె లయతప్పింది.

తమకంగా ఆమె ప్రక్కనే కూర్చున్నాడు.

దూరంగా సముద్రపు హోరు.....

చిలిపిగా శరీరాన్ని తాకుతున్న సన్నజాజుల పరిమళం..... అల్లరి చేస్తున్న పిల్లగాలులు...

హరివిల్లులా వంగిన ఆమె నడుంపై చేయివేశాడు.

ఆమెలో చలనం లేదు.

మరికాస్త చొరవ తీసుకుంటున్నట్లుగా ముందుకు వంగాడు.

అతని వేడి విశ్వాసం అమె చెంపల్ని తాకింది....

కళ్ళువిప్పిన శిల్ప జరుగుతున్నదేమిటో తృటిలో గుర్తించింది.

ఆవేశంతో పైకిలేచి రొప్పుతూ పైట సర్దుకుంది.

ఆమె తీక్షణ దృక్కుల్ని తాళలేని వాడిలా తలతిప్పుకున్నాడు... లజ్జాభారంతో అతని కనులు అరమోడ్పులయ్యాయి.

'సంస్కార వంతుడ్నని చాటి చెప్పుకున్న మిష్టర్ కిరీటి! మీరిప్పుడు చేయబోయిందేమిటి?'

వాడి బాణంలా అతడి మనసును తాకింది.

'సంఘంలో అతి పెద్దమనిషిగా చెలామణీ అవుతున్న కిరీటిగారూ! మీచేతలేం ఇంత నికృష్టంగా వున్నాయి?'

మరో శరాఘఘాతం అతడి మేధను తాకింది.

'పశువును కానని చెప్పుకుంటే చాలదండీ.. చెతల్లో నిరూపించుకోవాలి...'

'శిల్పా..'

అతడి గొంతు ఖంగున మ్రోగింది.

'ఏం... ఎందుకలా గొంతు చించుకుంటారు. నిజం నిష్టూరంగా వుందా, లేక మీ అహం అంగీకరించనంటోందా'

'నువ్వు నా భార్యవి....'

'అని మీరు మాత్రమే అనుకుంటే చాలదని మీకు ముందే చెప్పాను'

'ఏం చేస్తే నా భార్యనని అంగీకరిస్తావో అదైనా చెప్పు'

'ఆ అవకాశం మీరు కోల్పోయారు...'

‘కాదు..నిన్ను నీవు సంస్కరించుకోటానికి నేనీ అవకాశం యిస్తున్నాను.’

‘దానికి నేను సిద్ధంగా లేకపోతే....’

‘బలవంతంగానైనా నిన్ను నాదారిలోకి మళ్ళించుకోవాల్సి వుంటుంది’

‘అలాంటి పరిస్థితే వస్తే ఈ శిల్ప ప్రాణాలు తీసుకోవటానికైనా వెనుకాడదు’

‘అంతటి ఆత్మాభిమానివా’

‘అంతేకాదు... రాజానరేంద్రదేవ్ మనువరాల్ని కూడా.’

‘అంత గొప్పదానివైతే ఆ సహాయాన్నెందుకంగీరించావు. నా జీవితంలో ఎందుకు ప్రవేశించావు?’

‘నేను మీ జీవితంలో ప్రవేశించలేదు. మానాన్న గారికి డబ్బు ఎరచూపి మీరే నాజీవితంలోకి ప్రవేశించారు. నన్ను యుక్తిగా ట్రాప్ చేశారు’

ఆవేశంగా బయటకు వెళ్ళబోతుంటే ‘ఆగు, అటెక్కడికి‘ అంటూ అడ్డంగా వెళ్ళి నిలబడ్డాడు.

‘ప్రక్కగదిలోకి’

రోషంగా అతని కళ్ళలోకి చూసింది.

‘ఎందుకు’

‘మీ నుండి కలిగే ప్రమాదం నుండి నన్ను నేను రక్షించుకోవటానికి’

‘నేను  హాని చేయాలని సంకల్పిస్తే ఈ బంగళాలో ఏ గదీ నిన్ను కాపాడలేదు’

‘చెప్పానుగా అలాంటి పరిస్థితే ఏర్పడితే నన్ను నేను అంతం చేసుకోడానికైనా వెనకాడనని’

కిరీటి అడ్డం తొలగిపోయాడు. బాధగా నిట్టూర్చుతూ.

‘ఓకే.... నీఇష్టం.... కాని ఒక్క విషయం. మనమధ్య ఏర్పడ్డ అగాధం గురించి మూడోవ్యక్తి తెలుసుకోవటం నాకిష్టంలేదు.’

‘అలాంటి ఇబ్బంది ఇష్టంలేకనే ఇందాక డైనింగ్ టేబుల్ దగ్గర మీ సహధర్మ చారిణిగా నటించింది.’

‘ఇలా ఎన్నాళ్ళు...’

ద్వారం దాటబోయిన శిల్ప క్షణం పాటు ఆగింది...

‘మనం భార్యభర్తలుగా ఉన్నన్నాళ్ళు...’

సమాధానం పూర్తికాకుండానే తలుపు లోపలనుండి బోల్ట్ వేసింది.

నిస్సత్తువుగా పరుపుపై వాలిపోయాడు ‘మూషిక మార్జాల యుద్ధానికి ముగింపు ఎప్పుడో’ అనుకుంటూ.

రోజులు గడుస్తున్నా శిల్ప ప్రవర్తనలో అణు మాత్రమైనా మార్పు లేకపోవటంతో కిరీటి కూడా వీలైనంత దూరంగా ఉండటం అలవాటు చేసుకున్నాడు.

పగలంతా బిజినెస్ వ్యవహారాలతో తల మునకలవుతూ అర్ధరాత్రి వరకూ లైబ్రరీలో గడిపేస్తూ యాంత్రిక జీవితానికి అలవాటు పడిపోయాడు.